
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక


వరంగల్
సంపుటి : 3, సంచిక : 183 | ఆదివారం జూన్ 15, 2025 | పేజీలు : 4 వెల : రూ.3-00



ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలపై భారత్ స్పష్టత

4లో..

- ఇప్పటికైనా కళ్లు తెరవాలి..!
- రాష్ట్రంలో ఉన్నది చంద్రబాబు ప్రభుత్వమా..?
- నిధుల్లో, నదుల్లో స్టేట్ కు గుండు సున్నా కేటాయింపులు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు




## తెలంగాణకు కేంద్రం అన్యాయం..!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**

నిధుల్లో, నదుల్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్ర మంత్రులు నోరు విప్పడం లేదని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మండి పడ్డారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టులపై హరీష్ రావు శనివారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా లేక చంద్రబాబు డైరక్షన్లో నడుస్తున్న ప్రభుత్వమా అని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గోదావరి -బనకచర్లపై అఖిలపక్షంతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి బనకచర్ల గురించి అడగాలని కోరారు. గోదావరి-బనకచర్లకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారన్నారు. 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు నాయుడు 2008లో పెద్ద పోరాటం చేశారు. 200 టీఎంసీలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలి. రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే బీఆర్ఎస్ కు ముఖ్యం అన్నారు.

కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలాంటిదేనని హరీశ్‌రావు ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ సర్కారు ముందుకెళ్తుంటే తెలంగాణ సీఎం, ఇరిగేషన్ శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఏపీ సర్కారు ఈ నెలాఖరుకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిద్రపోతోందని విమర్శలు గుప్పించారు. నీటిపారుదల శాఖ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడానికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

కేటీఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ప్రభుత్వానికి ధ్యాస తప్ప రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదని అన్నారు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద తెలంగాణకు గుండు సున్నా అని వివరించారు. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే తెలంగాణకు సున్నా ఇదీ ఢిల్లీ పాలకుల వైఖరని హరీష్ రావు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి - బనకచర్లను అడ్డుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా తాము మద్దతిస్తామని అన్నారు.



## రక్తదాతలందరూ ప్రాణదాతలే..

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**

రక్తదాతలందరూ ప్రాణదాతలని, ఇది సామాజిక బాధ్యత అని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా శనివారం వరంగల్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం అనేది అన్ని దానాల కంటే గొప్ప దానం అని అన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు వచ్చినప్పుడే ఆపద సమయంలో ఉపయోగ పడుతుందని, రక్తం ఏ సమయంలో ఎప్పుడు అవసరం అవుతుందో ఎవరికి తెలియదన్నారు. ప్రమాదాల బారిన పడిన సమయంలో, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఇలా రకరకాల సమయాల్లో రక్తం అవసరమవుతుందని, ఐఎంఏ, స్వచ్ఛంద సంస్థలు రక్తదానాల శిబిరాలు నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆపదలో ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయని, జిల్లాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు రక్తదానం శిబిరాలు నిర్వహించటం అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరం ఉంటే స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తారని అన్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్త దానం చేసిన 52 మంది డాక్టర్లు, మెడికల్ రిప్రజెంటేటివ్ లకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జున రెడ్డి, జనరల్ సెక్రెటరీ డాక్టర్ అజిత్ మహమ్మద్, ట్రెజరర్ డాక్టర్ శిరీష్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్,యువ నేతాజీ ఫౌండేషన్ ప్రతినిధులు అరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుడిగా బీఎల్ఆర్

- స్వయంగా ఉదయం 5 గంటలకే పారిశుధ్య పనులను పరిశీలించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- మిర్యాలగూడను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని సూచన

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి:**





మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికుల పనితీరుని శనివారం ఉదయం 5 గంటలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నేరుగా పరిశీలించారు. మున్సిపల్ జవాన్లు,ట్రాక్టర్,ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి పట్టణ పారిశుద్ధ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిశుభ్రత విష యంలో గతంలో లాగా మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహి స్తే కఠిన చర్యలు తీసుకుంటానంటూ హెచ్చరిం చారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి స్వచ్ఛ మిర్యాలగూడగా ఉంచాలని సూచించారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడి అవతారంలో చెత్త వాహనాన్ని నడుపుకుంటూ గాంధీనగర్ కు వెళ్లి ఎమ్మెల్యే నేరుగా చెత్తను సేకరించారు. అనంతరం పట్టణంలోని గణేష్ మార్కెట్,ఇతర ప్రాంతాలను సుడిగాలిలా కాలి నడకన వెళ్లి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అంటే దేవాలయం లాంటిదని దానిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని కోరారు. పారిశు ద్ధ్య విషయంలో బాధ్యతగా పనిచేయలేమనుకున్న వారు విధుల నుండి తప్పుకోవాలన్నారు. బాధ్యతగా పనిచేసే కార్మికులకు ఎప్పుడు నేను అండగా ఉంటూ వారికి కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మిర్యాలగూడను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, ప్రభుత్వ అధికారులు,పలువురు జవాన్లు, మున్సిపల్ కార్మికులు భాగస్వాములయ్యారు.

### ఏపీ తొలగించిన 26 బీసీ కులాలను తెలంగాణ

## బీసీ కులాల్లో చేర్చొద్దు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



గతంలో ఆంధ్రప్రదేశ్లో చెందిన 26 బీసీ కులాలను తెలంగాణ బీసీ కులాల్లో చేర్చొద్దని బీసీ నాయకుడు లింగం గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 138 బీసీ కులాలు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత తెలంగాణ ప్రాంతంలో లేనివిగా భావించి 26 బీసీ కులాలను గత తెరాస ప్రభుత్వం తొలగించిందనీ,ఆ తొలగించిన బీసీ కులాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ ఏ ఏ జాబితాలో నుంచి తొలగించారో అదే జాబితాలో చేర్చమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ నాయకులు మరియు అక్కడి బీసీ కులాల ప్రతినిధులు ప్రభుత్వం ద్వారా అడగడం జరిగిందని అన్నారు. ఆ వెంటనే బీసీ కమీషన్ పబ్లిక్ హియరింగ్‌కు పిలవడం జరిగిందని, ఇలా పిలిచారంటేనే తెలంగాణ బీసీలకు ద్రోహం తలపెట్టినట్లేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. అభివృద్ధి చెందిన ఆంధ్ర బీసీ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో కలపడం వల్ల పీడిత కులాల వారు అన్యాయంకు గురవుతారనీ,గతంలో తెలంగాణలో ఉన్నటువంటి బీసీ కులాలు సామాజిక,ఆర్థిక,రాజకీయ, సాంస్కృతికంగా వెనుకబాటు తనానికి గురైన పరిస్థితి ఉందన్నారు. ఒకవేళ ఆ కులాల్ని ఇక్కడ చేర్చినట్లైతే ఇక్కడి బీసీ కులాల అభివృద్ధికీ విఘాతం కలిగించే వాళ్లవుతారు అని ఆవేదన వ్యక్తం చేశారు.

## సినీ నటి కల్పికపై మరో కేసు నమోదు..

**వేద న్యూస్, హైదరాబాద్**



సినీ నటి కల్పికా గణేష్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మరో కేసు నమోదు చేశా రు. 67 ఐటీఏ 2000-2008,79,356 BNS ప్రకా రంగా కేసు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో అసభ్య కరమైన పదజాలం ఉపయో గించి దూషించిందంటూ కల్పి కపై బాధితురాలు కీర్తన ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో అభ్యంతరకరమైన రీతితో కల్పిక వేధింపుల కు పాల్పడుతోందని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడి యాలో స్టేటస్ పెట్టడంతోపాటు తనకు మెసేజ్‌లు పెట్టి దారుణంగా మాట్లాడిందని బాధితు రాలు కీర్తన తెలిపారు. ఈ మేరకు కల్పికపై రెండో కేసు నమోదు అయ్యింది.

## లోక్ అదాలత్‌లో అప్పీల్ ఉండదు..!

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



లోక్ అదాలత్ లో పరస్పరం రాజీ చేసుకున్న కేసుల్లో అప్పీల్ ఉండదు అని జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో ఆయన మాట్లాడారు. కేసుల విచారణలో ఇరు పార్టీలు లోక్ అదాలత్ లో రాజీ పడటం వలన ఇరు పార్టీలు కూడా పై కోర్టుకి వెళ్లే అవకాశం లేదన్నారు. దీనివల్ల కేసుల్లో శాశ్వత పరిష్కారం తో పాటు, సత్వర న్యాయం లభిస్తుందన్నారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో భారీ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడంలో కృషి చేసిన న్యాయవాదులకు మరియు పోలీసులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజేల్లి రాందాస్, ట్రెజరర్ పడిగేలా శ్రీనివాస్, స్పోర్ట్స్ సెక్రటరీ బిగుల్లా శంకర్, లైబ్రరీ సెక్రటరీ పులి నర్సయ్య, లోక్ అదాలాత్ సభ్యులు జేడి సుధాకర్, కాజీపేట స్రవంతి, రాజేష్ శెట్టి, మ్యాన నరహరి, నీరటి రమణ, గడ్డం ప్రశాంత్ రెడ్డి, బత్తుల భరత్, సంగం సాగర్, మరియు బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

### లోక్ అదాలత్ లో మొత్తం 207 కేసుల పరిష్కారం

శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 207 కేసులు పరిష్కారం అయినట్టు సీనియర్ సివిల్ జడ్జి మరియు మండల లీగల్ సర్వీసెస్ చెర్మన్ డి. నాగేశ్వర్ రావు తెలిపారు. సీనియర్ సివిల్ కోర్టులో 4 కేసులు, జూనియర్ సివిల్ కోర్టులో 203 కేసుల్ని తీసివేసినట్టు చెప్పారు.

## గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి కేసీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్**



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. గత కొంత కాలంగా జలుబుతో బాధపడుతున్నారు మాజీ సీఎం. ఈ క్రమంలో ఆరోగ్య పరీక్షల కోసం ఈరోజు (శనివారం) ఉదయం ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. ఆయన వెంట కుటుంబసభ్యులు, మాజీ మంత్రి హరీష్ రావు, తదితరులు ఉన్నారు. నిన్ననే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్న గులాబీ బాస్ ఈరోజు మరో సారి ఆస్పత్రికి వెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తర్వాత నందీనగర్‌లోని నివాసానికి వెళ్లనున్నారు. ఐదు రోజులు నందీనగర్‌లో ఉండనున్నారు.

వేద న్యూస్

ఆదివారం, జూన్ 15, 2025

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

**– ఓంకార్ భవన్లో జరిగిన సభలో వివిధ పార్టీ ప్రజా సంఘాల నాయకుల డిమాండ్ – ర్యాలీని అడ్డుకున్న పోలీసులు**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపుమేరకు శనివారం వరంగల్ ఓంకార్ భవన్ లో ఆ పార్టీల జిల్లా నాయకులు సభ నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, సిపిఎం జిల్లా నాయకులు వలదాసు దుర్గయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి యాదగిరి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు మోడెం మల్లేశం, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చందర్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు జనగాం కుమార స్వామి, భారత్ బచావో జిల్లా నాయకులు ప్రవీణ్, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు జన్ను కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ,అమిత్ షా ప్రభుత్వం మధ్య భారతంలో మావోయిస్టుల అణచివేత పేరున వందల మంది మావోయిస్టులు ఆదివాసులను చంపి వేస్తున్నదన్నారు. రాజ్యాంగ ప్రకారం నడవాల్సిన బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా పనిచేస్తుందని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యం పట్ల మోడీకి గౌరవం లేదని బడా కార్పొరేట్ శక్తులు అయిన అంబానీ ఆదానిలకు అనుకూలంగా పరిపాలన సాగిస్తుందని వారు ధ్వజమెత్తారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా మోడీ ప్రభుత్వం యొక్క హత్యాకాండ ఆగలేదని వారన్నారు. ఆదివాసీలు మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా అని ప్రశ్నించారు?గతంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఉద్యమ సంస్థలతో చర్చలు జరిపిన సందర్భాలు ఉన్నాయని ఇప్పుడు మాత్రం మోడీ ప్రభుత్వం చర్చలకు తావు లేకుండా నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నదని వారు అన్నారు. మావోయిస్టుల ఆదివాసుల హననాన్ని ఆపివేసి వారితో చర్చలు జరపాలని వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.




–ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

అనంతరం ఆయా పార్టీ ప్రజాసంఘాల నాయకులు ఓంకార్ భవన్ నుండి వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వరకుర్యాలీ తీయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు పోలీసులకు నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. అయినప్పటికీ ర్యాలీ జరగనివ్వమని పోలీసులుతేల్చి చెప్పారు రోడ్డు పైకి వచ్చిన నాయకులు అక్కడే మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ నగర కార్యదర్శి బాశుమియా, ఎంసిపిఐయు నగర కార్యదర్శి సుంచు జగదీష్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్, భారత్ బచావో నాయకులు వెంగల్ రెడ్డి, ఓం బ్రహ్మం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, అరుణోదయ నాయకులు నలిగంటి పాల్, భైరబోయిన, ఐలయ్య, సుమన్ లతోపాటు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంజాయి స్వాధీనం..




**వేద న్యూస్,శాయంపేట :**

శాయంపేట మండలంలోని ఆరేపల్లి గ్రామం వద్ద నిషేధిత గంజాయిని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శాయంపేట సిఐ రంజిత్ రావు తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఎస్సై జక్కుల పరమేష్ పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆరేపల్లి వాటర్ ట్యాంక్ వద్ద నలుగురు వ్యక్తులు అనుమానస్పందంగా ఉండి పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబడించి పట్టుకొని విచారించగ వారి వద్ద ఒక కేజీ వంద గ్రాముల ఎండు గంజాయి లభించిందని దాని విలువ దాదాపు సుమారు రూ.55వేలు ఉంటుందని సిఐ తెలిపారు. కాగా నిందితులను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# ఫ్లైట్ నంబర్ 171కు వీడ్కోలు




**వేద న్యూస్, డెస్క్:**

ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకున్నది. ఫ్లైట్ నంబర్ 171కు వీడ్కోలు పలకనున్నది. విమాన ప్రమాదం మృతులకు నివాళిగా ఫ్లైట్ నంబర్ 171ను ఉపసంహరించుకున్నది. జూన్ 17 నుంచి ఇది అమలులోకి రానున్నది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో సుమారు 270 మంది మరణించారు. ఈ నేపథ్యంలో మృతులకు నివాళిగా ఫ్లైట్ నంబర్ 171కు ఎయిర్ ఇండియా స్వస్తి చెప్పనున్నది. ఎయిర్ ఇండియాతో పాటు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా విమాన నంబర్ 171ను రద్దు చేయనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా, జూన్ 17 నుంచి అహ్మదాబాద్-లండన్ గాట్విక్ విమాన సర్వీసు నంబర్ ఏఐ 171కు బదులుగా ఏఐ 159 ఉంటుందని ఎయిర్ ఇండియా అధికారులు తెలిపారు. టికెట్ బుకింగ్ వ్యవస్థలో ఈ మేరకు అవసరమైన మార్పులు శుక్రవారం జరిగినట్లు చెప్పారు. మరోవైపు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా విమాన నంబర్ ఐఎక్స్ 171ను తొలగించాలని నిర్ణయించినట్లు సంబంధిత అధికారి తెలిపారు. విమానం నంబర్ 171ను నిలిపివేయడం మరణించిన వారి ఆత్మకు గౌరవ సూచకమని చెప్పారు. 2020లో కేరళలోని కోజికోడ్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 21 మంది మరణించారు. ఆ తర్వాత ఆ విమాన నంబర్‌ను వినియోగించడాన్ని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నిలిపివేసింది.

# ఆటో డ్రైవర్ కూతురు.. విమాన ప్రమాదంలో మృతి

**వేద న్యూస్, డెస్క్:**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన వారి వివరాలు వెల్లడవుతున్నాయి. ఎంటెక్ చదివేందుకు కోటి ఆశలతో లండన్ వెళ్తున్న ఆటో డ్రైవర్ కుమార్తె కూడా ఈ ప్రమాదంలో చనిపోయింది. గుజరాత్‌లోని హిమత్‌నగర్‌లో నివసిస్తున్న పాయల్ ఖాతిక్ తండ్రి ఆటో డ్రైవర్. ఇంజినీరింగ్, టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చదవడానికి బ్రిటన్ యూనివర్సిటీలో ఆమె సీటు సంపాదించింది. కాగా, గురువారం పాయల్ ఖాతిక్ ఎంతో ఉత్సాహంగా తన కుటుంబ సభ్యులతో కలిసి అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నది. వారికి బై చెప్పి ఎయిర్ ఇండియా విమానం ఎక్కింది. అయితే టేకాఫ్ అయిన నిమిషంలోనే అది ఎత్తు కోల్పోయింది. మెడికల్ కాలేజీ హాస్టల్ బిల్డింగ్‌పై కూలి పేలిపోయింది. ఆ విమానంలోని 241 మంది, ఆ ప్రాంతంలోని వ్యక్తులతో సహా సుమారు 270 మంది ఈ ప్రమాదంలో మరణించారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

**– పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**
**– అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం**
**– ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**వేద న్యూస్, నెక్కొండ :**

కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమాన్ని నెక్కొండ లో భూమి పూజ చేసి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అన్నారు. అర్హులందరికీ తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మోంటిసోరి హైస్కూల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**వేద న్యూస్,నెక్కొండ :**

నెక్కొండ మండలం రామాలయం వీధిలో తాటిపత్రి అంజన్ రెడ్డి, టీ మధుకర్ రెడ్డి, ఆనంద్ రావులు నూతనంగా ఏర్పాటు చేసిన మోంటి సోరి హైస్కూల్ ను నర్సంపేట శాసన సభ్యులు దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలి

**వేద న్యూస్, హన్మకొండ :**

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల 50 వేల కోట్ల రూపాయలు కేటాయించి రూ.30 కోట్లకు పైగా ఉన్న ఉపాధి కార్మికులకు సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు 700 రూపాయలు కూలి ఇవ్వాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశానికి అధ్యక్షులు మునిగాల బిక్షపతి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధులలో కోత పెడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల పొట్ట కొడుతున్నదన్నారు.కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను విడనాడి కార్మిక కర్షకుల ప్రయోజనాల కోసం పాటుపడకుంటే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఇంకెన్నడు ఇస్తారని ప్రశ్నించారు. కొత్తగా పెన్షన్ల కోసం వృద్ధులు వితంతువులు వికలాంగులు లక్షలాది మంది ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని వారి ఆవేదనను అర్థం చేసుకొని మంజూరీ చేయాలన్నారు. సామాజిక పెన్షన్ రూ.4 వేలు, వికలాంగులకు రూ.6వేలు, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చేసిన వాగ్దానాలను అమలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, బొట్టు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.




# ఏపీలో డీఎస్సీ పరీక్షల తేదీలను మార్చిన ప్రభుత్వం

**వేద న్యూస్, డెస్క్:**

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి, వాటిని జూలై 1, 2 తేదీల్లో నిర్వహించనున్నట్లు డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శనివారం ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించారు. విశాఖపట్నం సాగర తీరంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరుకానున్నారు. సుమారు ఐదు లక్షల మందితో యోగాసనాలు వేయించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం దృష్ట్యా, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఆ పనుల్లో నిమగ్నమై ఉంటుందని, అదే సమయంలో రవాణా సౌకర్యాలు కూడా పరిమితంగా అందుబాటులో ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్న ఆలోచనతో ప్రభుత్వం ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది. డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి విడుదల చేసిన ప్రకటన ప్రకారం, వాయిదా పడిన పరీక్షలకు సంబంధించిన అభ్యర్థులు తమ సవరించిన హాల్‌టికెట్లను జూన్ 25వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ హాల్‌టికెట్లలో కొత్త పరీక్షా కేంద్రాలు, మార్చిన తేదీల వివరాలు స్పష్టంగా పొందుపరచబడతాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పులను గమనించి, కొత్త హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ప్రకారమే పరీక్షలకు హాజరు కావాలని కృష్ణారెడ్డి సూచించారు. అభ్యర్థుల సౌకర్యాన్ని, రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.



# మరోసారి అప్‌డేట్ గడువు పొడిగించిన ఉడాయ్..!

**వేద న్యూస్, డెస్క్:**

దేశంలోని కోట్లాది మంది ఆధార్ కార్డ్ యూజర్లకు ఉడాయ్ మరోసారి భారీ ఉపశమనం కలిగించింది. ఆధార్ కార్డులోని వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు గడువును మరోసారి పొడిగించింది. గతంలో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆధార్ అప్‌డేట్‌కు చివరి తేదీ జూన్ 14 వరకు ఉండేది. కానీ, దాన్ని జూన్ 14 2026 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఉడాయ్ ఈ విషయాన్ని వెల్లడించింది. దాంతో యూజర్లు మరో సంవత్సరం పాటు ఆధార్ తమ వివరాలను అప్‌డేట్ చేసుకునే సదుపాయం లభించనున్నది. ఈ నిర్ణయంతో లక్షలాది మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఉడాయ్ పేర్కొంది. ఆధార్‌ను ఎవరైనా యూజర్లు తమ తాజా సమాచారంతో అప్‌డేట్ చేసుకునేందుకు అవసరమైన డాక్యుమెంట్లను 'మై ఆధార్' పోర్టల్ ద్వారా ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేందుకు వీలుంది. ప్రస్తుతం ఉన్న డేటాలో ఏవైనా మార్పులుంటే చేసుకునేందుకు ఉడాయ్ అవకాశం కల్పిస్తున్నది. ఇందులో భాగంగా యూజర్లు అడ్రస్‌ను ఉచితంగా మార్చుకోవచ్చు. వాస్తవానికి వివాహం జరిగిన వారు.. వలస వెళ్లేవారు.. ఉద్యోగరీత్యా వివిధ చోట్లకు వెళ్లేవారు చిరునామా మారుతూ వస్తుంటుంది. ఈ క్రమంలో వీరికి ఉడాయ్ నిర్ణయంతో వీరందరికీ ఎంతో ఉపయోకరంగా ఉండనున్నది. వాస్తవానికి ఆధార్ తీసుకొని పదేళ్లు పూర్తయిన వారంతా తప్పనిసరిగా తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచించిన విషయం తెలిసిందే. గతంలో ఈ ప్రక్రియ కోసం ఆధార్ కేంద్రాల్లో రూ.50 వసూలు చేసే వారు. అదే అవకాశాన్ని ఆన్‌లైన్‌లో ఉచితంగా చేసుకునేందుకు ఉడాయ్ వీలుకల్పిస్తున్నది.




**– ఆధార్‌ను అప్‌డేట్ చేయడం ఇలా..**

మొదట మీ ఆధార్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. మీ ఆధార్ ఎన్‌రోల్ సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. లాగిన్ అయ్యాక మీ ఆధార్ వివరాలు కనిపిస్తాయి. వివరాలు అన్నీ సరైనవా కాదా? చూసుకోవాలి. ఏవైనా తప్పులుంటే మార్పులు చేసుకోవాలి. వివరాలు అన్నీ సరిగ్గా ఉంటే నెక్ట్స్ బటన్‌పై క్లిక్ చేయాలి. అయితే, ఏవైనా మార్పులు ఉంటే.. అందుకు సంబంధించిన వివరాలను మార్చుకొని.. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి తర్వాత సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. అప్‌డేట్ చేసిన తర్వాత 14 అంకెల రిక్వెస్ట్ పిన్ నంబర్ వస్తుంది. ఈ నంబర్ సహాయంతో ఎప్పటికప్పుడు మీ ఆధార్ అప్‌డేట్ వివరాలను చెక్ చేసుకునేందుకు వీలుంటుంది.

# జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు పారిపోయారు

**వేద న్యూస్, డెస్క్:**

గత జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు ఏపీ నుంచి పారిపోయారని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. విద్యావిధానం పటిష్ట పరిచేందుకు విద్యార్థులకు స్కిల్ డెవలప్ చేస్తున్నామని అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలను అవమానపరిచేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో చాలామంది వైసీపీ నేతలకు బెయిల్ దొరకటం లేదని చెప్పారు. ఇవాళ(శనివారం) అమరావతిలో మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. కేవలం ఓ వ్యక్తికి బెయిల్ దొరికితేనే అంతా బాగున్నట్లుగా వైసీపీ నేతలు ప్రవర్తించటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పాలనలో అమలు చేశామని ఉద్ఘాటించారు మంత్రి కొలుసు పార్థసారథి. తల్లికి వందనం పథకాన్ని ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున ఎవరూ అమలు చేయలేదని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. తల్లికి వందనంలో భాగంగా ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం అమలు చేశామని తెలిపారు. వైసీపీ అమ్మబడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిందని.. పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రతిపక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష పార్టీ దేశంలో కేవలం వైసీపీనేనని విమర్శలు చేశారు. తల్లికి వందనంలో రూ. 2 వేలు మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని వైసీపీ నేతలు అన్నారని.. ఈ విషయంలో లోకేష్ సవాల్‌కి సిద్ధమా అంటే వారు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రూ. 34 వేల కోట్లు ఏడాదిలో పెన్షన్ కిందా ఇచ్చామని చెప్పారు. వైసీపీ హయాంలో ఏ పథకాలు ఇచ్చారో తెలుసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ. 1.04లు ఇచ్చామని గుర్తుచేశారు. జగన్ హయాంలో కేవలం రూ.64 వేలు మాత్రమే ఇచ్చారని.. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించారా అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.





**– సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశాం...**

'కూటమి పాలనలో తల్లికి వందనం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నాం. మా ప్రభుత్వంలో పిల్లలను చదివించి, వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. మేము సామాన్యులను ఎక్కడా కేసులు పెట్టి వేధించలేదు. గత వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో పని చేసింది. కూటమి పాలనలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తాం. ఆ రెండు వేల రూపాయలను పాఠశాలలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఖర్చు చేస్తాం. అశోక్ లేలాండ్, అమర్ రాజా లాంటి సంస్థలు ఏపీ నుంచి వెళ్లిపోయాయి. గత జగన్ ప్రభుత్వంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు.. మా ప్రభుత్వంలో వడ్డీలకే వేల కోట్లు చెల్లిస్తున్నాం. పోలవరాన్ని ధ్వంసం చేశారు. అమరావతి రాజధాని అని మూడు రాజధానులని చట్టం చేసిందే వైసీపీ. పోలవరం ప్రాజెక్టు 2027లోగా పూర్తి చేస్తాం. 87 లక్షల మంది ఉంటే 45 లక్షల మందికే ఎందుకు అమ్మవడి ఇచ్చారు' అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు

# ఆ రోజున తాజ్‌మహల్‌కు ఫ్రీ ఎంట్రీ..!

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



మీరు తాజ్ మహల్, ఆగ్రా కోట, ఫతేపూర్ సిక్రీ వంటి స్మారక చిహ్నాలను సందర్శించాలనుకుంటున్నారా..? అది కూడా ఫ్రీ ఎంట్రీతో చూడాలనుకుంటే మీరు వెంటనే టూర్ ప్లాన్ చేసుకోండి.. ఎందుకంటే.. యోగా డే సందర్భంగా తాజ్ మహల్‌కు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఇది కేవలం స్థానిక పర్యాటకులకే కాదు.. భారతీయులు, విదేశీయులందరికీ నిర్దేశించిన చారిత్రక ప్రదేశాల్లో రోజంతా టికెట్టు లేకుండా లోనికి ప్రవేశించేందుకు అనుమతి కల్పిస్తున్నారు. యోగా దినోత్సవం నాడు స్మారక చిహ్నాలకు ఉచిత ప్రవేశం పర్యాటకులను ఆకర్షిస్తుంది. యోగా దినోత్సవం నాడు తాజ్ మహల్ తో సహా అన్ని స్మారక చిహ్నాలను సందర్శించడం ఉచితం. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటారు. యోగా దినోత్సవం నాడు తాజ్ మహల్ తో సహా అన్ని స్మారక చిహ్నాలలోకి ప్రవేశం ఉచితం అని భారత పురావస్తు సర్వే సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు భారత పురావస్తు సర్వే సంస్థ స్మారక చిహ్నాలలో ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిలో తాజ్ మహల్‌తో సహా అన్ని స్మారక చిహ్నాలలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. అయితే తాజ్ ప్రధాన గోపురం సందర్శించడానికి రూ. 200 అదనపు టికెట్ వర్తిస్తుంది. తాజ్ మహల్ సందర్శన కోసం వచ్చే ప్రజలకు సాధారణ టికెట్ ధర రూ. 50లు. ఇది మూడు గంటలు చెల్లుతుంది. ఉర్సు సమయంలో పర్యాటకులు షాజహాన్, అతని భార్య ముంతాజ్ నిజమైన సమాధులను చూడటానికి నేలమాళిగలోకి ప్రవేశించడానికి అనుమతిస్తారు.

# పైలెట్ చివరి మాటలు ఇవే

**వేద న్యూస్, డెస్క్:**



అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. విమానం కూలిపోక ముందు కాక్‌పిట్‌లో ఏం జరిగింది అనేది మాత్రం ఇంకా పూర్తిగా బయటకు రాలేదు. అయితే విమానం కూలిపోయే సమయంలో ఏటీసీతో పైలెట్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఏటీసీతో ఎయిరిండియా పైలెట్ చివరి సంభాషణ వైరల్ అవుతోంది. 'విమానంలో పవర్ లేదు. నో థ్రస్ట్. గోయింగ్ డౌన్.. మేడే.. మేడే.. మేడే..' అని పైలెట్ సుమత్ ఏటీసీకి చెప్పారు. ఈ సంభాషణ ఏటీసీలో రికార్డు అయింది. థ్రస్ట్ అంటే విమానాన్ని ముందుకు నడిపే శక్తి. ఇది విమానం ఇంజిన్‌లు లేదా ప్రొపెల్లర్‌ల ద్వారా ఉత్పత్తి అవుతుంది. థ్రస్ట్ అనే పదానికి తెలుగులో నెట్టడం అనే అర్థం కూడా ఉంది. దీంతో ఈ విమాన ప్రమాదంలో ఇంజిన్ లేదా ప్రొపెల్లర్‌ల వైఫల్యం కీలక పాత్ర పోషించినట్టు అర్థమవుతోంది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. విమానం ఓ మెడికల్ కాలేజ్ మీద పడింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 274కు చేరింది. ఈ ప్రమాదంపై కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.

## బాధితులకు ఎయిర్ ఇండియా అదనపు ఆర్థిక సాయం

**వేద న్యూస్, డెస్క్:**

ఎయిర్ ఇండియా విమాన ప్రమాద బాధితులకు సంస్థ తక్షణ ఆర్థిక సాయం ప్రకటించింది. మధ్యంతర సాయం కింద బాధితులకు రూ.25 లక్షలు (21 వేల జీబీపీ) ఇవ్వనున్నట్టు ప్రకటించింది. బాధితులకు గతంలో టాటా సన్స్ ప్రకటించిన రూ. కోటి ఆర్థిక సాయానికి ఇది అదనమని పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎయిర్ ఇండియా పోస్టు పెట్టింది. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తాము అన్ని రకాలుగా అండగా ఉంటామని ఎయిర్ ఇండియా పేర్కొంది. బాధిత కుటుంబాలకు సాయం కోసం క్షేత్రస్థాయిలో తమ బృందాలు కృషి చేస్తున్నాయని తెలిపింది. ఇందులో భాగంగానే మధ్యంతర ఆర్థిక సాయం ప్రకటించినట్టు వెల్లడించింది. ప్రమాద ఘటన తమను ఎంతో కలచివేసిందని పేర్కొంది.




# ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి



**వేద న్యూస్, డెస్క్:**

మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగాలను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టుకోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారంటూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా ఆడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మవోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం

# కత్తి పట్టుకోమన్న కార్యకర్తపై కమల్ హాసన్ ఫైర్



**వేద న్యూస్, డెస్క్:**

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ తన పార్టీ కార్యక్రమంలో తీవ్ర అసహనానికి గురయ్యారు. ఓ కార్యకర్త అత్యుత్సాహంతో ఆయన చేతికి బలవంతంగా కత్తిని ఇవ్వబోవడమే ఇందుకు కారణం. ఈ అనూహ్య పరిణామంతో వేదికపై కాసేపు గందరగోళం నెలకొనగా, పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, చెన్నైలో జరిగిన ఎంఎన్ఎం పార్టీ సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కార్యక్రమం ఉత్సాహంగా సాగుతున్న వేళ, కొందరు కార్యకర్తలు కమల్ హాసన్‌కు ఓ పెద్ద కత్తిని బహూకరించారు. అభిమానుల కేరింతల మధ్య కమల్ నవ్వుతూనే దానిని స్వీకరించి ఫోటోలకు పోజులిచ్చారు. అయితే, అదే సమయంలో మరో కార్యకర్త వేదికపైకి దూసుకొచ్చి, కమల్ చేతికి బలవంతంగా కత్తిని అందించే ప్రయత్నం చేశాడు. ఈ చర్యతో కమల్ హాసన్ ఒక్కసారిగా తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆయన ముఖంలో చిరునవ్వు మాయమై, ఆగ్రహం స్పష్టంగా కనిపించింది. సదరు కార్యకర్త వైపు తీవ్రంగా చూస్తూ, కత్తిని కింద పెట్టమంటూ గట్టిగా సంజ్ఞ చేశారు. అక్కడే ఉన్న ఓ పోలీసు అధికారి వెంటనే స్పందించి, ఆ కార్యకర్తను నిలువరించి, కత్తిని పక్కనబెట్టారు. అయినప్పటికీ, ఆ కార్యకర్త కమల్ హాసన్‌తో కరచాలనం చేసేందుకు, ఫోటో దిగేందుకు పట్టుబట్టడంతో, భద్రతా సిబ్బంది అతడిని పక్కకు తీసుకెళ్లారు. ఈ ఘటనతో సభా ప్రాంగణంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం, కమల్ హాసన్ తేరుకుని కార్యక్రమాన్ని కొనసాగించారు.



వేద న్యూస్

ఆదివారం, జూన్ 15, 2025

# ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలపై భారత్ స్పష్టత

## జూన్ 13న ప్రకటించిన వైఖరికే కట్టుబడి ఉన్నామని విదేశాంగ శాఖ ప్రకటన

**వేద న్యూస్, డెస్క్:**



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ మరోసారి స్పష్టం చేసింది. షాంఘై సహకార సంస్థ (ఎస్ సీఓ) వేదికగా భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ వైఖరిని పునరుద్ఘాటించింది. ఉద్రిక్తతలు తగ్గించడానికి అంతర్జాతీయ సమాజం క్రియాశీలక పాత్ర పోషించాలని కూడా పిలుపునిచ్చింది. చైనా నేతృత్వంలోని ఎస్ సీఓ, ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండించినప్పటికీ, భారత్ మాత్రం ఈ విషయంలో తన తటస్థ వైఖరిని కొనసాగించింది. ఇజ్రాయెల్-ఇరాన్ వివాదంపై జూన్ 13న తాము వెలిబుచ్చిన అభిప్రాయానికే కట్టుబడి ఉన్నామని భారత విదేశాంగ శాఖ తెలిపింది. “ఈ అంశంపై భారతదేశ వైఖరిని జూన్ 13న స్పష్టం చేయడం జరిగింది, అదే వైఖరి కొనసాగుతుంది. ఉద్రిక్తతలను తగ్గించే దిశగా కృషి చేయడానికి చర్చలు, దౌత్య మార్గాలను ఉపయోగించుకోవాలని మేము కోరుతున్నాము. అంతర్జాతీయ సమాజం ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టడం అత్యవసరం” అని మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

# మణిపూర్‌లో భారీగా ఆయుధాలు, బుల్లెట్లు స్వాధీనం

**వేద న్యూస్, డెస్క్:**



మణిపూర్‌లో అల్లరిమూకలపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. మణిపూర్ పోలీసులు, అసోం రైఫిల్స్, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ జాయింట్ ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఐదు జిల్లాల్లో సోదాలు చేసిన భద్రతా బలగాలు 328 అధునాతన ఆయుధాలను సీజ్ చేశాయి. 151 రైఫిళ్లు, 65 ఇన్సాస్ రైఫిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 9,300 రౌండ్ల బుల్లెట్లతోపాటు.. భారీగా పేలుడు పదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు .. మణిపూర్‌లోని ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇంఫాల్ తూర్పు, ఇంఫాల్ పశ్చిమ, బిష్ణుపూర్, కాక్చింగ్, తౌబాల్ అనే ఐదు లోయ జిల్లాల శివార్లలో జూన్ 13-14 మధ్య రాత్రి నిఘా వర్గాల నేతృత్వంలో దాడులు నిర్వహించినట్లు మణిపూర్ పోలీసులు తెలిపారు. “ఉమ్మడి బృందాలు పేలుడు పదార్థాలు, ఇతర ఆయుధాల నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి. 151 రైఫిల్, 65 ఇన్సాస్ రైఫిల్స్, ఇతర రకాల 73 రైఫిల్స్, 5 కార్బైన్ గన్, 2 -5 గన్, భారీగా బుల్లెట్ నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి” అని మణిపూర్ పోలీసు లారి డోర్జీ లాటూ తెలిపారు. మొత్తం తుపాకులు, రైఫిళ్లు 328 స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడడానికి ప్రజలకు సహకరించాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. అరాచకశక్తులపై పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు ఏడీజీపీ డార్జీ. ఎట్టి పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతామని వెల్లడించారు.సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి అందరూ సహకరించాలని.. మణిపూర్ పోలీసులు, భద్రతా దళాలు కోరాయి.

# రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు

**వేద న్యూస్, డెస్క్:**



కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. “ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది” అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. “గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది” అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. “ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది” అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# తొలి మృతదేహాన్ని కుటుంబానికి అప్పగింత

**వేద న్యూస్, డెస్క్:**



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలోమరణించిన వారిని డీఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. డీఎన్ఏ మ్యాచింగ్ తర్వాత నిర్ధారించిన తొలి మృతదేహాన్ని బాధిత కుటుంబానికి శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విషాద వాతావరణం నెలకొన్నది. దుఃఖిస్తున్న బంధువులు మృతదేహాన్ని అందుకున్నారు. గుజరాత్ మంత్రి జగదీష్ విశ్వకర్మ ఈ సందర్భంగా అక్కడ ఉన్నారు. అధికారిక ఎస్కార్ట్‌తో మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు. కాగా, విమాన ప్రమాదంలో ప్రయాణికులు, సిబ్బంది, ఇతర వ్యక్తులతో సహా 270 మందికిపైగా మరణించారు. విమానంలో మంటల వల్ల చాలా మంది సజీవదహనమయ్యారు. ఈ నేపథ్యంలో డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులందరినీ గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. డీఎన్ఏ పరీక్షల ప్రక్రియను సమీక్షించారు. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), హోం శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. బాధితులను గుర్తించి, మృతదేహాలను వీలైనంత త్వరగా వారి కుటుంబాలకు అప్పగించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని హర్ష్ సంఘవి తెలిపారు.

# గద్దర్ అవార్డుల వేడుక.. సీఎం రేవంత్ రెడ్డి, అల్లు అర్జున్ ఆత్మీయ ఆలింగనం

**వేద న్యూస్, డెస్క్:**



తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్ హైటెక్స్‌లో శనివారం సాయంత్రం ఘనంగా మొదలైంది. ఈ వేడకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు, ఎఫ్డీసీ ఎండీ హరీశ్ జ్యోతి ప్రజలన చేసి వేడుకను ప్రారంభించారు. అలాగే ఈ వేడుకకు సినీప్రముఖులు బాలకృష్ణ, సుకుమార్, డైరెక్టర్ మణిరత్నం, అల్లు అర్జున్, సుహాసిని, విజయ్ దేవరకొండ తదితరులు హాజరయ్యారు. పలువురు విజేతలకు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అవార్డులు అందించారు. మెమొంటోతోపాటు రూ.5 లక్షలు, ప్రశంసా పత్రం అందచేశారు. పుష్ప చిత్రానికి గానూ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ గద్దర్ అవార్డును ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. కాసేపట్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అల్లు అర్జున్ గద్దర్ అవార్డ్ అందుకోనున్నారు.

# దీన్ని బట్టి కొమ్మినేని వ్యాఖ్యలను సుప్రీం కూడా తప్పుబట్టింది!



**వేద న్యూస్, డెస్క్:**

వైసీపీ నాయకులు, ముఖ్యంగా ఆ పార్టీ మహిళా నేతలు చేస్తున్న విమర్శలపై ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో స్పందించారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళల రక్షణ విషయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంటే, దానిపై వైసీపీ కడుపు మంటతో విమర్శలు చేస్తోందని ఆరోపించారు. వైసీపీ మహిళా నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని హితవు పలికారు. అమరావతిని “వేశ్యల రాజధాని” అంటూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, అలాంటి వ్యక్తిని వైసీపీ నేతలు, మాజీ మంత్రులు సమర్థించడం దారుణమని మంత్రి అనిత అన్నారు. “అదే అమరావతిలో జగన్మోహన్ రెడ్డి, భారతి రెడ్డి ఇల్లు కట్టుకోలేదా? మాజీ మంత్రులు, ఎంపీలు, వారి కుటుంబాలు నివసించడం లేదా?” అని ఆమె ప్రశ్నించారు. మహిళలను అగౌరవపరిచేలా మాట్లాడిన వ్యక్తికి సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇస్తే, దాన్ని సమర్థిస్తూ జగన్మోహన్ రెడ్డి ట్వీట్ చేయడం మహిళల పట్ల ఆయనకున్న గౌరవాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. కొమ్మినేని శ్రీనివాస్‌కు ఇచ్చిన బెయిల్ షరతుల్లో టీవీ డిబేట్లలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదని స్పష్టంగా ఉందని, దీన్నిబట్టి ఆయన వ్యాఖ్యలు తప్పని సుప్రీంకోర్టు కూడా నిర్ధారించిందని అనిత గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు బనాయించి చంద్రబాబును, అంకబాబునూ, ఒక వృద్ధురాలిని అర్ధరాత్రి అరెస్టు చేయించిన ఘటనలను ఆమె ప్రస్తావించారు. “తనదాకా వస్తే కానీ నొప్పి తెలియదు అన్నట్లుంది వైసీపీ నేతల తీరు” అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దిశ యాప్ గురించి మాట్లాడుతూ, కోటి మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని గొప్పలు చెప్పారని, కానీ వాస్తవానికి 30 లక్షల మంది కూడా లేరని, అబ్బాయిల చేత కూడా బలవంతంగా డౌన్‌లోడ్ చేయించిన సందర్భాలున్నాయని ఆరోపించారు. తాము ప్రవేశపెట్టిన శక్తి యాప్‌కు కోటి 50 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీని ద్వారా రాత్రిపూట ఒంటరిగా ప్రయాణించే మహిళలకు కూడా ట్రావెలింగ్ అసిస్టెన్స్ అందిస్తున్నామని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, క్రైమ్ రేట్ తగ్గిందని హోంమంత్రి స్పష్టం చేశారు. కడపలో మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి చంపిన నిందితుడు భయంతో ఆత్మహత్య చేసుకున్న ఘటనను ఉదహరించారు. తప్పు చేసిన వాడు సమాజంలో బతకడానికి కూడా భయపడే పరిస్థితిని తాము కల్పిస్తున్నామని అన్నారు.

పొగాకు రైతుల సమస్యలపై మాట్లాడటానికి వెళ్లిన జగన్మోహన్ రెడ్డి, కేజీ పొగాకు ధర కూడా తెలియకుండా పేటీఎం బ్యాచ్‌ను వెంటేసుకుని వెళ్లి పోలీసులపై రాళ్లు రువ్వించారని ఆరోపించారు. తెనాలిలో రౌడీ షీటర్‌ను పరామర్శించడానికి వెళ్లడం జగన్మోహన్ రెడ్డి మానసిక పరిస్థితికి నిదర్శనమని విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, ఉద్యోగుల జీపీఎఫ్ డబ్బులు, చివరికి మహిళలు దాచుకున్న స్త్రీనిధి రూ.2000 కోట్లను కూడా డైవర్ట్ చేసిందని హోంమంత్రి అనిత ఆరోపించారు. “15వ ఆర్థిక సంఘం నిధులు డైవర్ట్ చేశారని మాపై ఆరోపణలు చేస్తున్నారు. డైవర్షన్ల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు” అని అన్నారు. ‘తల్లికి వందనం’ పథకం కింద ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.13,000 చొప్పున, రూ.2,000 స్కూల్ మెయింటెనెన్స్‌కు కేటాయిస్తుంటే, దానిపై కూడా బురద చల్లుతున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదని, ఇప్పుడు తాము డీఎస్సీ నిర్వహిస్తుంటే దాన్ని ఆపడానికి కోర్టులకు వెళ్లారని విమర్శించారు. “నేను కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ప్రకటించిన డీఎస్సీలోనే టీచర్‌గా సెలెక్ట్ అయ్యాను. ఈరోజు ఆయన మంత్రివర్గంలో హోంమంత్రిగా ఉన్నాను. ఇది చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శనం” అని అనిత పేర్కొన్నారు. పోదిలి ఘటనపై మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ముస్లిం మహిళలపై వైసీపీ గూండాలు దాడులు చేశారని, దీని వెనుక ఉన్న సూత్రధారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని, ఎన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. మహిళలను అగౌరవపరిచేలా ఎవరు మాట్లాడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073